# కవిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

## ఎన్టీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన టీడీపీ నేతలు

**ఖమ్మం, /జూన్ 4 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎన్టీఆర్ విగ్రహంపై చేసిన వ్యాఖ్యలను ఖమ్మం జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా నాయకుడు వనమా వాసు మాట్లాడుతూ, అధికారంలోకి వస్తే ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించి ఆంధ్రప్రదేశ్‌కు పంపిస్తామంటూ కవిత చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని అన్నారు.




తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్‌పై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని, వెంటనే వాటిని వెనక్కి తీసుకుని తెలుగు ప్రజలకు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని, ఆయన స్థాయిని తక్కువ చేసి మాట్లాడే హక్కు ఎవరికీ లేదన్నారు.
రాజకీయ ప్రత్యర్థులను విమర్శించే క్రమంలో మహానుభావుల వ్యక్తిత్వాలను కించపరచడం ప్రజలు సహించరని వనమా వాసు హెచ్చరించారు. ప్రజల సమస్యలపై దృష్టి సారించకుండా వివాదాస్పద వ్యాఖ్యలతో రాజకీయ లబ్ధి పొందాలని చూడడం మంచిది కాదన్నారు. ఇకనైనా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్న కోటిరెడ్డి జ్ఞాపకార్థం సేవాసదనానికి సామగ్రి విరాళం



**మధిర/, జూన్ 4 (జర్నలిస్ట్ వార్త):**
వీరులపాడు మండలం అల్లూరు గ్రామానికి చెందిన మేకపోతుల చిన్న కోటిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మేకపోతుల నర్సిరెడ్డి, కోడలు అనురాధ మధిరలోని మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రానికి స్టీల్ ప్లేట్లు, కర్రీ స్టాండ్లు, గరిటెలను విరాళంగా అందజేశారు.
ఈ సందర్భంగా పునరావాస కేంద్రం నిర్వాహకులు మాట్లాడుతూ, చిన్న కోటిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం, ఓదార్పు ప్రసాదించాలని ప్రార్థించారు. మానసిక దివ్యాంగుల సంక్షేమానికి ఉపయోగపడే వస్తువులను అందజేసిన నర్సిరెడ్డి, అనురాధ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రుల జ్ఞాపకాలను సేవా కార్యక్రమాల ద్వారా చిరస్థాయిగా నిలుపుకోవడం ఆదర్శనీయమని పేర్కొంటూ, ఈ విరాళం పునరావాస కేంద్రంలోని పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. మానసిక దివ్యాంగ చిన్నారుల తరఫున దాత కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# జామాయిల్ తోటలో అగ్నిప్రమాదం...

## తప్పిన పెను ప్రమాదం

**కల్లూరు, /జూన్ 4 (జర్నలిస్ట్ వార్త):**
కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంకి ఎస్టేట్ సమీపంలోని జామాయిల్ తోటలో గురువారం ఆకస్మికంగా అగ్నిప్రమాదం సంభవించింది. గాలి వేగం కారణంగా మంటలు వేగంగా వ్యాపించి భారీగా ఎగిసిపడటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అగ్నిప్రమాదాన్ని గమనించిన స్థానిక నివాసితులు స్వచ్ఛందంగా స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. తోటకు సమీపంలో రైస్ మిల్లులు, నివాస గృహాలు ఉండటంతో పెను ప్రమాదం



తప్పిందని స్థానికులు తెలిపారు. ఘటన సమాచారం అందుకున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ వెంటనే అధికారులను, ప్రజాప్రతినిధులను, పార్టీ శ్రేణులను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందజేయడంతో మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, సత్తుపల్లి అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.
ఫైర్ ఇంజన్‌తో పాటు మున్సిపాలిటీ వాటర్ ట్యాంకర్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు సిబ్బంది శ్రమించారు. అనంతరం సంఘటనా ప్రదేశాన్ని మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, పలువురు ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టంపై అధికారులు విచారణ చేపట్టారు.

# ధర్మ సమాజ్ పార్టీ జిల్లా పగ్గాలు కొట్టే ఏసేపుకు





హనుమకొండ జిల్లా ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు కొట్టే ఏసేపు

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూన్ 4 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడిగా ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన కొట్టే ఏసేపును పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు పార్టీ రీజనల్ ఇన్‌చార్జి మేకల సుమన్ మహారాజ్ గురువారం ప్రకటించారు. గత తొమ్మిదేళ్లుగా ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి. విశారదన్ మహారాజ్ అనుచరునిగా కొనసాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఏసేపు, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. పార్టీ విస్తరణ, సంస్థాగత నిర్మాణంలో చురుకైన పాత్ర పోషిస్తున్న ఆయనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కొట్టే ఏసేపు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసి, పార్టీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాలోని కార్యకర్తలు సమష్టిగా పనిచేసి ధర్మ సమాజ్ పార్టీ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి జిల్లాలో బలమైన శక్తిగా నిలబెట్టడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

# జేఎస్ఆర్ సేవలు భగీరథుడి తీరును తలపిస్తున్నాయి

## పదిహేనేళ్లుగా నిరంతర ప్రజాసేవతో ప్రజల మన్ననలు

**ఎల్కతుర్తి,/జూన్ 4 (జర్నలిస్ట్ వార్త)**
హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రజాసేవకు చిరునామాగా నిలిచిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపరెడ్డి సురేందర్ రెడ్డి (జేఎస్ఆర్) సేవలు భగీరథుడి కృషిని తలపిస్తున్నాయని ప్రజలు కొనియాడుతున్నారు. రాజకీయాలకు అతీతంగా గత పదిహేనేళ్లుగా పారదర్శకంగా, స్వచ్ఛందంగా ప్రజలకు సేవలందిస్తూ ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొంటున్నారు. భీమదేవరపల్లి మండలంలోని కన్నారం గ్రామానికి చెందిన జేఎస్ఆర్ పేదలు, నిరుపేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులను కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు 50 కిలోల బియ్యంతో పాటు




నిత్యావసర సరుకులు అందిస్తూ మానవతా దృక్పథాన్ని చాటుతున్నారు.
కొత్తకొండ దేవస్థానంలో భక్తులకు వేలాది మామిడి మొక్కలను పంపిణీ చేసి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా మొక్కల పంపిణీ చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించారు.
ప్రతి ఏడాది వేసవి కాలంలో బస్టాండ్‌ల సమీపంలో చల్లని తాగునీటి రిఫ్రిజిరేటర్లను ఏర్పాటు చేసి ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చడంలో ముందుంటున్నారు. అంతేకాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి స్వంత ఖర్చులతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ స్థాయిలో ఉన్నవారు సైతం చేయని సేవా కార్యక్రమాలను స్వచ్ఛందంగా నిర్వహిస్తూ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న జేఎస్ఆర్ సేవలు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో వన సంరక్షణ సమితి సభ్యులకు అవగాహన సదస్సు.






**బయ్యారం/,జూన్ 4.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండల కేంద్రంలో రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వన సంరక్షణ సమితి కమిటీ సభ్యులకు డిఎఫ్ఓ బి.విశాల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బిట్ ఆఫీసర్ శంకర్ మాట్లాడుతూ అడవుల్లో ప్లాస్టిక్ తొలగింపు,సంరక్షిత పర్యావరణం,రక్షిత వన్యప్రాణులు,అటవీ చట్టం గురించి వన సంరక్షణ సమితి సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిఎఫ్ఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ,పోడు వ్యవసాయ నివారణ,అడవుల్లో కార్చిచ్చుల నియంత్రణపై విస్తృత ప్రచారం కల్పిస్తున్నామన్నారు. అలాగే అక్రమ కలప రవాణాను అడ్డుకోవడం, వన్యప్రాణులను వేటగాళ్ళ బారి నుంచి కాపాడటంపై,వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు గ్రామస్థులకు తగు సూచనలు ఇస్తున్నాట్లు వారు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో పోడు వ్యవసాయానికి బదులు ప్రత్యాన్మాయ జీవనోపాధి మార్గాలను చూపిస్తూ అటవీ భూముల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నామన్నారు. వన సంరక్షణ సమితి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అడవుల అభివృద్ధి,పచ్చదనం పెంపుదల కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో ఎఫ్‌డిఓ వెంకటేశ్వరలు,ఎఫ్ఆర్ఓ రవికిరణ్,డిఆర్ఒలు,రవి రమేష్,రేంజ్ సిబ్బంది వన సంరక్షణ సమితి కమిటీ ఛైర్మన్,వైస్ ఛైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

# పంట అవశేషాల దహనం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ..

**బయ్యారం/,జూన్ 4.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం నారాయణపురం గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహణలో భాగంగా గురువారం మండల వ్యవసాయ అధికారి కే.రాజు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సొలం బాలకృష్ణ,రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొని పంట అవశేషాల దహనం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.
ర్యాలీ సందర్భంగా పంట అవశేషాల దహనం వలన భూసారం తగ్గిపోవడం, వాయు కాలుష్యం పెరగడం,పర్యావరణానికి నష్టం కలగడం వంటి అంశాలను రైతులకు వివరించారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్ని సేంద్రియ పదార్థంగా వినియోగించాలని రైతులకు




సూచించారు. అనంతరం ఇసుకమేది గ్రామపంచాయతీలో గ్రామ సభ నిర్వహించి రైతులకు పంటల వైవిధ్యీకరణ,యూరియా వినియోగం తగ్గింపు,నానో యూరియా ప్రోత్సాహం, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం,రైతు రిజిస్ట్రీ నమోదు,నకిలీ విత్తనాల నివారణ మరియు ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ




సందర్భంగా రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. రైతులు ధృవీకరించిన విక్రేతల వద్ద నుండే విత్తనాలు కొనుగోలు చేయడం,ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం వంటి అంశాలపై నిబద్ధత వ్యక్తం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఫయాజ్,జీపీఓ బాబు,ఉపసర్పంచ్ బోయిన యాదమ్మ,బత్తుల శ్రీను,అంగన్వాడి సిబ్బంది,ఆశా వర్కర్లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ఉప్పలపాడు సర్పంచ్.




**బయ్యారం/,జూన్ 4.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం ఉప్పలపాడు గ్రామపంచాయతీలో విద్యార్థుల కోసం కరాటే,వెయిట్ లిఫ్టింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ పిఈటీ విజయనిర్మల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ పానుగోతు వెంకన్న క్రీడాకారులకు పోషకాల కోసం పండ్లు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉప్పలపాడు గ్రామపంచాయతీలో ఇలాంటి కార్యక్రమాలకు ఎల్లవేళల నా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గ్రామ పంచాయతీలో విద్య,వైద్యం,క్రీడలు, రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోడి మమత,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల టెండర్లలో సామాజిక వర్గాలకు అన్యాయం?

## నిబంధనల సడలింపుకు జాయింట్ కలెక్టర్‌ను ఆశ్రయించిన కాంట్రాక్టర్ల జేఏసీ

**ఖమ్మం/, జూన్ 4 (జర్నలిస్ట్ వార్త):**
గురుకుల విద్యాసంస్థల్లో చేపడుతున్న టెండర్ ప్రక్రియలో అమలు చేస్తున్న కఠిన నిబంధనల వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లు పోటీకి దూరమవుతున్నారని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కాంట్రాక్టర్ల జేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఖమ్మం జిల్లా జాయింట్ కలెక్టర్, డీపీసీ కమిటీ చైర్మన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేసింది. గురుకులాల కిరాణా, గుడ్ల సరఫరా టెండర్లను గతంలో అమలు చేసిన



డీపీసీ విధానంలోనే నిర్వహించాలని జేఏసీ నాయకులు కోరారు. ప్రస్తుతం టెండర్లలో విధించిన ఐటీ రిటర్న్, ట్రేడ్ లైసెన్స్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్, అనుభవ ధ్రువపత్రాలు వంటి అర్హతలు సామాన్య కాంట్రాక్టర్లకు భారంగా మారాయని పేర్కొన్నారు. దీంతో స్థానికంగా ఉపాధి పొందుతున్న అనేక మంది టెండర్ ప్రక్రియకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని తెలిపారు. క్యాటరింగ్, కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, స్వీపింగ్, శానిటేషన్ తదితర సేవల టెండర్ల విషయంలో కూడా గతంలో అమలైన విధానాన్నే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగా రంగంలోకి వచ్చే కాంట్రాక్టర్లకు అవకాశాలు కల్పించడంతో పాటు సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చేలా నిబంధనల్లో సడలింపులు తీసుకురావాలని కోరారు. స్థానిక కాంట్రాక్టర్ల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సానుకూల నిర్ణయం తీసుకోవాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కన్వీనర్ ఉదయ్‌తో పాటు చిరంజీవి, శరత్, ప్రసాద్, బాలరాజు, రత్తయ్య, నాగరాజు, శ్రీనాథ్, భాస్కర్, నాగేంద్రబాబు, గోపాలరావు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

